సాక్షి తిరుపతి

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



నాడు 16 మంది... నేడు ఇద్దరు

ఇసుక మాఫియా ఆగడాలకు నాడు 16 మంది, ఇప్పుడు ఇద్దరు మృతిచెందడం సర్వత్రా చర్చనీయాంశమైంది. - IIలో



అక్రమ మైనింగ్‌పై మెరుపు దాడులు

సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై మెరుపు దాడులు చేసి, 13 మందిపై కేసులు నమోదు చేశారు. - IIలో



ఆకస్మిక తనిఖీ

శ్రీకాళహస్తి జెడ్పీ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకాన్ని 12వ అదనపు జిల్లా జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. - IIలో

న్యూస్‌రీల్

వివాదాస్పద భూముల పరిశీలన



చింతలపాళెంలో వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

ఏర్పేడు: మండలంలోని చింతపాళెం రెవెన్యూలో షికారీలు, రైతుల మధ్య ఉన్న వివాదాస్పద భూములను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం పరిశీలించారు. గత 20 ఏళ్లుగా ఇరువర్గాల మధ్య భూతగాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కేసు కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో షికారీల విన్నపం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని రికార్డులు, భూములను పరిశీలించారు. అలాగే జేసీ ముందుగా పల్లం పంచాయతీ పరిధిలో టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు పంపిణీ చేసిన భూములను పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడారు. భూములిచ్చిన వారందరికీ ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించలేదని నిర్వాసితులు జేసీకి విన్నవించారు. సమస్యను కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకుని వెళ్లి నిజమైన నిర్వాసితులందరికీ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భార్గవి పాల్గొన్నారు.

సముద్రంలో అలజడి



తూపిలిపాళెం వద్ద ఎగసి పడుతున్న అలలు

వాకాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాన్ ప్రభావంతో గురువారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో అలజడి ఏర్పడింది. మొన్నటి వరకు ఉవ్వెత్తున ఎగసి పడిన సముద్రపు కెరటాలు కాస్త శాంతించే లోపే మరో విపత్తు సంభవించి తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సముద్రంలోకి ఎవరు వెళ్ల వద్దని స్థానిక మత్స్యకార పెద్దలు పర్యాటకులు, మత్స్యకారులను ఆదేశించారు. 45 బోట్లకు చెందిన కొందరు మత్స్యకారులు సముద్రంపై వేటలో ఉన్నప్పటికీ వారిని త్వరగా ఒడ్డుకు చేరుకోవాలని ఫోన్ ద్వారా గ్రామ పెద్దలు ఆదేశాలు ఇవ్వడంతో ఒడ్డుకు చేరుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. వేట నిలిపి సామగ్రిని మత్స్యకారులు సముద్రపు ఒడ్డున భద్రపరిచారు. ఉదయం నుంచి తీరంలో ఈదురు గాలులు వీస్తున్నాయి. దాదాపు 3 మీటర్లు ఎత్తుకు కెరటాలు ఎగసి పడుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. తీర గ్రామాలైన తూపిలిపాళెం, పామంజి, కొండూరుపాళెం, అంజలాపురం, దుగ్గరాజపట్నం, శ్రీనివాసపురం, పంబలి, పులింజేరివారిపాళెం, మొనపాళెం, ఓడపాళెం, వైట్‌కుప్పం, చినతోట, పూడికుప్పం, పూడిరామిదొరువు, నవాబుపేట గ్రామాల్లో మత్స్యకారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

29న జాబ్ మేళా

తిరుపతి అర్బన్: గూడూరులోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ, సీడ్‌ఆఫ్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలు బహుళజాతి కంపెనీలు వస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమా తదితర అన్ని కోర్సులు చదివిన వారు అర్హులని తెలిపారు. వారి విద్యార్హతను ఆధారంగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా సర్టిఫికెట్లు జెరాక్స్‌తోపాటు ఆధార్ కార్డు జెరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 86398 35953 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు బత్తెయ్య. ఈయనది ఏర్పేడు మండలం మన్నసముద్రం ఎస్సీ కాలనీ. ఆయన కుమారుడు చంద్ర శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బత్తెయ్య వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కొడుకుని చదివిస్తున్నాడు. ప్రస్తుతం కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించాలని ఒత్తిడి తెస్తోంది. కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ కింద ఫీజు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పేద, మధ్యతరగతి విద్యార్థి ఉజ్వల భవితకు సోపానం .. ప్రభుత్వం అందించే ఆ సాయంతో అతడి కల సాకారం సాధ్యం.. ఉన్నత శిఖరాల అధిరోహణకు ఆస్కారం.. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఆ సాయం విడుదలలో కూటమి సర్కారు నిర్లక్ష్యం.. ఇస్తారో, లేదో తెలియని వైనం.. కాసులు కడితేనే చదువని కళాశాలల యాజమాన్యం ఆదేశం.. ఫలితం.. పేదలకు శాపం.. సగటు విద్యార్థి చదువుకు భంగం.. ఇదీ ప్రస్తుత ప్రభుత్వ నిర్వాకం.



కాసు కొంటేనే చదువు

- ఫీజు బకాయిలు చెల్లించని కూటమి సర్కారు
- ఉన్నత చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- పథకాన్ని నీరుగారుస్తున్న కూటమి పాలకులు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా సతాయిస్తోంది. అసలు ఇస్తుందా? లేదా? అనే విషయంలో స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫీజు చెల్లించాలని కళాశాలల నుంచి ఒత్తిళ్లు వస్తుండడంతో తమ బిడ్డల చదువులు మధ్యలో ఆగిపోతాయేమోననే బెంగతో విద్యార్థుల తల్లిదండ్రులు దిగులు పడుతున్నారు. అయితే గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బకాయిలతోపాటు ఎప్పటికప్పుడే ఫీజు చెల్లిస్తూ పేద విద్యార్థులకు అండగా నిలిచారు.

కళాశాలల ఒత్తిళ్లు అధికం

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 189 డిగ్రీ కాలేజీలు, ఇంజినీరింగ్ 22, ఎంబీఏ, ఎంసీఏ 29 కళాశాలలున్నాయి. ఆ కళాశాలల్లో టర్మ్ ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నఫళంగా ఫీజులు చెల్లించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలిలా..

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ మొత్తం (రూ.లక్షల్లో)
తిరుపతి	4,008	3,27,13,039
శ్రీకాళహస్తి	4,083	3,01,40,663
చంద్రగిరి	5,008	3,68,39,994
సత్యవేడు	2,824	1,76,87,213
గూడూరు	3,568	2,56,89,745
సూళ్లూరుపేట	2,897	3,56,45,987
వెంకటగిరి	3,879	3,54,68,756
మొత్తం	26,267	21,41,85,397

గతంలో ఆర్థిక వెసులుబాటు

పేద, మధ్య తరగతుల కుటుంబాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో భరోసాగా ఉండేది.

వైఎస్సార్ సీపీ పాలనలో సాహసోపేత నిర్ణయం

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కానీ కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్‌-1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఆయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజిక వర్గాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరించేందుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే జగనన్న విద్యాదీవెన పేరుతో ఆయా విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని అప్పటి ప్రభుత్వమే చెల్లించింది.

జిల్లాలోని కళాశాలల సమాచారం

డిగ్రీ కళాశాలలు	189
ఇంజినీరింగ్ కళాశాలలు	22
ఐటీఐ కళాశాలలు	24
నర్సింగ్ కళాశాలలు	49
పాలిటెక్నిక్ కళాశాలలు	28
మెడికల్	14
బీఈడీ కళాశాలలు	16
ఎంబీఏ, ఎంసీఏ	29
మొత్తం కళాశాలలు	371

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకొకసారి జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పేరుతో విద్యార్థుల తల్లిండ్రులకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ వచ్చింది.

నోరు మెదపని కూటమి సర్కారు

క్షేత్రస్థాయిలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఫీజుల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసినప్పటికీ కూటమి సర్కారు నోరు మెదపడం లేదు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి, విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాధ్యతలు చేపట్టినప్పటికీ ఆయన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

బాబు పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్

2017–18, 2018–19 విద్యాసంవత్సరాల్లో చంద్రబాబు ప్రభుత్వంలో పెండింగ్ పెట్టిన ఫీజు బకాయిలు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019–20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. అలాగే కుటుంబ వార్షిక ఆదాయాన్ని కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్ధారిస్తే, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. ఈ నేపథ్యంలోనే వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.23 వేలు ప్రకారం అందించింది.

గత ఐదేళ్లలో రూ.1106.62 కోట్లు విడుదల

ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ తదితర సామాజిక వర్గాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.1106.62 కోట్లు జమ చేశారు.

ఫీజులు వెంటనే చెల్లించాలి



ప్రస్తుత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకపోవడంతో కళాశాలల్లో ఇబ్బందులు పెడుతున్నారు. ఫీజులు చెల్లించాలని ప్రస్తుతం ఒత్తిడి చేస్తుండడంతో చదువుపై ఆసక్తి తగ్గుతోంది. గత ప్రభుత్వ పాలనలో మాకు సకాలంలో నిధులు మంజూరు చేసేవారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయకుండా రాజకీయాలతో ముడిపెట్టి ఆలస్యం చేయడం సబబు కాదు. – వంశీ, ఇంజినీరింగ్ విద్యార్థి, తిరుపతి జిల్లా

ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు



కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. నా రెండో కుమారుడు నెల్లూరు జిల్లా వీఆర్ లా కళాశాలలో లా చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో రూ.13 వేలు సహాయం చేసేవారు. ఇప్పుడేమో డబ్బులు ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం పేద పిల్లల చదువుల పట్ల అలసత్వం వహించడం అన్యాయం .కూటమి ప్రభుత్వం ఎందుకు నగదు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నా. – విమల, విద్యార్థి తల్లి, చిన్నగొట్టిగల్లు మండలం, తిరుపతి జిల్లా

పరీక్షలు రాయనివ్వమంటున్నారు



ఫీజులు చెల్లించకపోతే నా బిడ్డను పరీక్షలు రాయనివ్వమని కళాశాల వారు భయపెడుతున్నారు. ప్రభుత్వమేమో ఇప్పటివరకు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదు. గతంలో వలంటీర్లను అడిగితే చెప్పేవారు. ఇప్పుడు పట్టించుకునే వారే లేరు. దీంతో అప్పులు చేసి ఫీజు చెల్లించాల్సి వస్తోంది. – సావిత్రమ్మ, విద్యార్థిని తల్లి, తిరుపతి జిల్లా

తల్లిదండ్రులకు చాలా ఇబ్బందిగా ఉంది



ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బుల గురించి ఎవరూ ఏమీ చెప్పడం లేదు. కళాశాలలో అడిగితేనేమో వారు సమాధానం లేదు. ప్రభుత్వం నుంచి స్పందన లేదు.ఎప్పుడిస్తారో తెలియడం లేదు. అంత వరకు ఫీజులు చెల్లించకపోతే కళాశాలలో ఒత్తిడి చేస్తున్నారు. ఇది మా తల్లిదండ్రులకు ఇబ్బందిగా ఉంది. – రవి, డిగ్రీ విద్యార్థి, పాకాల, తిరుపతి జిల్లా

చెంచయ్యను టీడీపీ నేతలే హతమార్చారు!

నాయుడుపేటటౌన్: పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త బండి చెంచయ్యను టీడీపీ నేతలే పథకం ప్రకారం దారుణంగా హత మార్చారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుమానం వ్యక్తం చేశారు. గురువారం చెంచయ్య మృతదేహానికి పోస్టుమార్టం జరిగే వరకు మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య నాయకులతో కలిసి వైద్యశాల వద్దే ఉన్నారు. అనంతరం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పార్టీకి బలమైన నాయకుడిగా ఉంటూ టీడీపీ ఆరాచకాలను ప్రశ్నిస్తుండడంతో ఆయన్ని తుద ముట్టించాలని కుయుక్తులు పన్నుతున్నట్లు ఆరోపించారు. సూళ్లూరుపేట నియోజవర్గంలో ఇప్పటివరకు లేని హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ, టీడీపీ నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులకు స్థానిక ఎస్‌ఐ అండగా నిలుస్తున్న వైనంపై ఎస్పీతోపాటు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. చెంచయ్యను పథకం ప్రకారం హత్య చేసి, దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, నిజాలను నిగ్గు తేల్చాలన్నారు. ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ గూండాల చేతుల్లో వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త బండి చెంచయ్య హతుడయ్యాడని, ఇది చాటా బాధాకరమన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సైతం చెంచయ్య మృతిపై దిగ్భ్రాంతి చెందారన్నారు. పార్టీ తరఫున చెంచయ్య కుటుంబానికి రూ.లక్ష నగదును పార్టీ జిల్లా అధ్యక్షుడి చేతులు మీదుగా అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, వైఎస్సార్ సీపీ నేతలు మద్దాలి సోమశేఖర్ రెడ్డి, గంధవల్లి సిద్ధయ్య, రఘునాయుడు, పాదర్తి హరినాథ్‌రెడ్డి, చదలవాడ కుమార్, పడగాల హరిబాబు రెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, పేర్నాటి రాహుల్, షేక్ షబ్బీర్, శ్రీరాములురెడ్డి, చెందిటి వెంకటేశ్వర్లు, నిడిగింటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య చిత్రంలో సత్యనారాయణరెడ్డి

చెంచయ్య మృతదేహం అప్పగింత

- పోలీసు బందోబస్తు నడుమ అంత్యక్రియలు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బండి చెంచయ్య(48)అలియాస్ పోతురాజు మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, గురువారం బంధువులకు అప్పగించారు. టీడీపీ వర్గీయుల కుట్ర పన్ని, చెంచయ్యను హతమార్చారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫోరెన్సిక్ పరీక్షలు నిమిత్తం ముఖ్య అవయవాలను విజయవాడకు పంపినట్లు స్థానిక వైద్యాధికారులు తెలిపారు. వడ్డిపాళెంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సీఐ సంగమేశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుని భార్య ప్రమీల, కుమారుడు సుకుమార్, కుమార్తె చైతన్య కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధువుల అశ్రునయనాల నడుమ చెంచయ్య అంతిమక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ హరిబాబురెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, రఘునాయుడు, అంకయ్య, మోహన్, గురవయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, మధుసూదన్‌నాయుడు, రమణారెడ్డి పాల్గొన్నారు.



చెంచయ్య అంతిమయాత్ర

29, 30 తేదీల్లో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఈ నెల 29, 30వ తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో 29వ తేదీన అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్యారంబోర్డు, యోగా, వెయిట్ లిఫ్టింగ్/పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30వ తేదీన కబడ్డీ, కుస్తీ, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, ఖోఖో, స్విమ్మింగ్, వాలీబాల్, క్రికెట్, బెస్ట్‌ఫిజిక్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళలు, పురుషులు అర్హులని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధారు కార్డు, కార్యాలయ గుర్తింపు కార్డుతో 29వ తేదీ ఉదయం 9గంటలకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

తిరుపతి డీఆర్వోగా నరసింహులు

– ఆర్డీఓగా రామ్మోహన్



జీ.నరసింహులు, డీఆర్వో



బి.రామ్మోహన్, తిరుపతి ఆర్డీఓ

తిరుపతి అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారిగా నరసింహులు, తిరుపతి ఆర్డీఓగా రామ్మోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న పెంచలకిషోర్‌ను విజయవాడ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. పెంచలకిషోర్ గత ఏడాది సెప్టెంబర్ నుంచి తిరుపతి డీఆర్వోగా పనిచేశారు. ఆయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జీ.నరసింహులుకు పదోన్నతి కల్పిస్తూ తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ చేశారు. కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు ఈయన మూడో డీఆర్వోగా బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రోటోకాల్‌–2గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌నాయుడిని చీరాల ఆర్డీఓగా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న బి.రామ్మోహన్‌ను తిరుపతి ఆర్డీఓగా బదిలీ చేశారు. గత నెలరోజులుగా తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీఓగా పనిచేస్తున్న బి. రామ్మోహన్‌కే ఆ అవకాశం లభించడం గమనార్హం.

భద్రతకే తొలి ప్రాధాన్యం

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో భద్రతకే తొలిప్రాధాన్యత కల్పించాలని పారిశ్రామిక ఉన్నత స్థాయి కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఉన్నత స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని పలు పరిశ్రమల్లో భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించడానికి పలు పరిశ్రమలను తనిఖీ చేశామని వెల్లడించారు. నిత్యం పరిశ్రమలపై నిఘా ఉంచాలని ఆమె సూచించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు నుంచి ఆమె పలు సూచనలు స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము మాట్లాడుతూ పరిశ్రమల్లో వంద శాతం మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు కలెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, ఆనంద్ తోపాటు ఉన్నతస్థాయి అధికారులు శరవణన్, రోషిణి, ఉమామహేశ్వరరావు, ఐఐటీ చెన్నై ప్రొఫెసర్లు రాఘవన్, సునీల్‌కుమార్, మాన్యుఫ్యాక్చర్ ఈడీ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పారిశ్రామిక ఉన్నత స్థాయి కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా

అమ్మో.. బాంబ్

- హోటళ్లు, ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు
- పరుగులు పెట్టిన పోలీసులు
- ఉలిక్కిపడిన తిరుపతి

తిరుపతి అర్బన్: నగరంలోని స్టార్ హోటళ్లకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి బాంబు బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రధానంగా లీలామహల్ సర్కిల్, కపిలతీర్థం, అలిపిరి సమీపంలోని నాలుగు గుర్తింపు పొందిన హోటళ్లకు మెయిల్స్ ద్వారా బెదిరింపులకు దిగారు. నగదు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు చర్చసాగుతోంది. లేదంటే చంపుతామని, మీ హోటళ్లలో పలుచోట్ల బాంబులు పెట్టామని హెచ్చరించినట్లు సమాచారం. వెంటనే హోటళ్ల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన పోలీసులు హోటల్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బాంబు బూచీ సమాచారంతో తిరుపతి నగర వాసులు ఉలిక్కి పడ్డారు. గురువారం రాత్రి ఆ హోటల్స్‌తోపాటు నగరంలోని అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కానీ ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు.

విమానాశ్రయానికి..

ఏర్పేడు: బాంబు బెదిరింపు ఈ మెయిల్‌పై తిరుపతి విమానాశ్రయ స్టార్ ఎయిర్‌లైన్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ మేనేజర్ షబీర్ గురువారం ఫిర్యాదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. బెంగళూరులోని స్టార్ ఎయిర్ హెడ్ ఆఫీస్‌తో అనుబంధించిన తిరుపతి ఎయిర్ ఫోర్ట్ అధికారిక స్టార్ ఎయిర్ ట్విట్టర్ ఖాతాకు గుర్తుతెలియని వ్యక్తి గురువారం బాంబు బెదిరింపు సందేశాన్ని పంపినట్లు చెప్పారు. విమానాలను ఎస్5–154(టీఐఆర్–ఐఎక్స్‌జీ) ప్రధాన అధి కారుల అనుమతి పొందిన అనంతరం మధ్యాహ్నం 1.21 గంటలకు బయలుదేరి వెళ్లినట్లు చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.



తిరుపతిలోని హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.80,650
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,308
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,00,900
రిటైల్ వెండి గ్రాము రూ.103.90

క్లుప్తంగా

మధ్యాహ్న భోజన పథకం ఆకస్మిక తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక కోర్టు 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిత్యం జరిగే కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలు

గూడూరురూరల్: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గురువారం ఓ పిచ్చి కుక్కదాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఓ పిచ్చికుక్క తహసీల్దార్ కారు డ్రైవర్‌తోపాటుగా, అటెండర్‌ను కరిచింది. దీంతో పనుల నిమిత్తం వచ్చిన వారు పరుగులు తీసి రూంలోకి వెళ్లారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

పాకాల: అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మద్దయ్యఆచారి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రహస్య సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి ఆరు కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం, కడలూరు జిల్లా సీఎస్ పాళ్లెం లోని చొక్కనాదపేటకు చెందిన శంకర్ కుమారుడు శరవణన్ శంకర్ అని విచారణలో తేలిందన్నారు. సుమారు రూ.72 వేలు విలువ చేసే గంజాయిని అతడి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై చెన్నైలోనూ రెండు కేసులు నమోదై ఉన్నాయన్నారు.

నాడు 16 మంది.. నేడు ఇద్దరు.. రేపు ఇంకెందరో?

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- కళ్లకు గంతలు కట్టుకున్న అధికార యంత్రాంగం
- నాడు ఏర్పేడు ఘటనలో 16మంది రైతులు
- నేడు దొమ్మరపాళెం ఘటనలో తండ్రీకొడుకులు


మునగలపాళెంలోని మృతుల స్మారక చిహ్నం(ఫైల్)



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మునగలపాళెం రైతులు(ఫైల్)


ఏర్పేడు ప్రమాదపు దృశ్యం(ఫైల్)


శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలం (ఫైల్)

రేణిగుంట: 'ఎనిమిదేళ్ల కిందట ఇసుకాసురుల దాష్టీకానికి బలైన కుటుంబాల్లో ఇప్పటికీ కారు చీకట్లు, కన్నీటి సుడులు తిరుగుతూనే ఉన్నాయి. ఒక దుర్ఘటన.. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 16 మంది ప్రాణాలను బలి తీసుకుంది.. ఊరు వల్లకాడును తలపించింది.. మరి కొంతమందిని శాశ్వత వైకల్యానికి గురిచేసింది. వీరంతా నేటికీ దయనీయ పరిస్థితుల్లో బతుకుబండి లాగుతున్నారు.. మళ్లీ..అలాంటి పరిస్థితులకే అధికార ముసుగులోని ఇసుకాసురులు బీజం వేశారు. ఇసుకాసురుల నిర్లక్ష్యానికి మరోసారి బుధవారం రాత్రి తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన రాజేంద్ర, అతని ఏడేళ్ల కుమారుడు చైతన్య దుర్మరణం పాలు కావడం స్థానికంగా తీవ్ర విషాదం కలిగిస్తోంది.'

అది.. 2017, ఏప్రిల్ 21వ తేదీ.. ఏర్పేడు మండలం మునగలపాళెం, మరికొన్ని గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు, స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలకు సాగునీరందడం లేదని తహసీల్దార్‌కు విన్నవించేందుకు ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడ తహసీల్దార్ లేకపోవడంతో వేచి ఉండి.. ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు అప్పటి జిల్లా ఎస్పీ జయలక్ష్మి వచ్చిన సమాచారం తెలుసుకుని ఆమెకు తమ గోడు చెప్పుకోవాలని వెళ్లారు సుమారు 30 మంది రైతులు. అయితే పోలీసులు వారిని స్టేషన్‌లోకి రాకుండా దోషుల్లాగా రోడ్డుపైనే నిలబెట్టారు. ఎస్పీ వెళుతూ.. పక్కనే ఉన్న అప్పటి సీఐ సాయినాథ్‌ను కలవాలని సూచించారు. అయితే ఆయన్ని కలిసేందుకు వేచి ఉన్న రైతులపై లారీ రూపంలో మృత్యుశకటం దూసుకొచ్చింది. క్షణాల్లో ఆ రైతుల ప్రాణాలు గాల్లో కలసిపోయాయి. ఈ దుర్ఘటనలో 16 మంది రైతులు దుర్మరణం పాలయ్యారు. 21 మంది క్షతగాత్రులయ్యారు.

నేటి దుర్ఘటన ఇలా..

టీడీపీ అధికారంలోకి వచ్చాక.. నాలుగు నెలలుగా నియోజకవర్గంలో ఇసుకాసురులు మరోసారి విజృంభించారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అయితే ఈ అక్రమ రవాణాకు ఏ మాత్రం సంబంధం లేని ఓ నిరుపేద కుటుంబం బలైంది. తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన కంచి రాజేంద్ర, అతని భార్య గురవమ్మ, కుమారుడు చైతన్యకు జ్వరం రావడంతో శ్రీకాళహస్తికి వెళ్లి వైద్యం చేయించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా, వెనుక నుంచి ఇసుక ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టి, రాజేంద్ర, అతని కుమారుడు చైతన్య ప్రాణాలను బలితీసుకుంది. దీంతో ఊరు, ఊరంతా కన్నీటిసంద్రమైంది. ఇలా ఇసుకాసురుల ధనదాహానికి నాడు 16 మంది, నేడు తండ్రీకొడుకులు.. రేపు ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

అప్పట్లో వైఎస్ జగన్ పరామర్శ

అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మాఫియాను ఉలికిపాటుకు గురి చేసింది. అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మునగలపాళెం గ్రామానికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఘటన జరిగిన వెంటనే మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని ఆ ఘోరం చూసి చలించిపోయారు. క్షతగాత్రులను మోసుకుంటూ 108 వాహనాల్లో ఎక్కించి ఆస్పత్రికి తరలించి, సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేలు తమ సొంత నగదును వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మృతుల కుటుంబాలకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతిచెందిన రైతుల జ్ఞాపకార్థంగా మునగలపాళెం గ్రామానికి సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన అమరవీరుల స్థూపం నిర్మించుకుని క్రమం తప్పకుండా ప్రతి ఏడాది మృతుల కుటుంబాల సభ్యులు నివాళులర్పిస్తున్నారు. కాగా అప్పట్లో ఈ ఘటనలో ప్రధాన సూత్రధారులు, పాత్రధారులైన టీడీపీ నాయకులు పేరం ధనంజయులునాయుడు, పేరం నాగరాజునాయుడు, పేరం చిరంజీవులునాయుడు మరికొంత మందిపై కేసులు నమోదు చేసి టీడీపీ నుంచి సస్పెండ్ చేశారు.

ఈ పాపం ఎవరిది?

– మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తి: ఇసుక మాఫియా కారణంగా తండ్రీకొడుకులు ప్రాణాలు కోల్పోవాల్సివచ్చిన పాపం ఎవరిదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక మాఫియాతో 45 వేల ఎకరాల ఆయకట్టుకు ముప్పు వాటిల్లుతోందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అరాచకాలకు అధికారులు సైతం భయపడుతున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు తమ పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలను అడ్డుకుని, ఆయన్ని అదుపులోపెడుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

ధర్నాలు చేస్తే నయా పైసా రాదు



ధర్నా నిర్వహిస్తున్న మహిళలను లోపలికి తీసుకెళుతున్న నేతలు

శ్రీకాళహస్తి: ఇసుక అక్రమ రవాణాకు అన్యాయంగా బలైన కంచి రాజేంద్ర, కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రి ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్న టీడీపీ నాయకులు, రాజేంద్ర కుటుంబ సభ్యులను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. వారు ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నాకు దిగడంతో అక్కడకు చేరుకుంటున్న వైఎస్సార్ సీపీ వామపక్ష నాయకులను చూసి ఎటు పోయి, ఎటు వస్తుందోనని వారి కుటుంబ సభ్యుల్లో కొంతమంది పిలిచి మీరు ధర్నాలు చేస్తే మీకు రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు కూడా రాకుండా పోతాయంటూ బెదిరించినట్లు సమాచారం. ముగ్గురు బిడ్డలను పెట్టుకుని ఎలా బతకాలో తెలియని పరిస్థితిలో ఉన్న రాజేంద్ర కుటుంబ సభ్యులు అక్కడి నుంచి బలవంతంగా ఆస్పత్రి లోపలికి తీసుకుని వెళ్లారు. అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రి లోపలే ఆటోలు ఎక్కించి ఊరికి పంపించేశారు. మృతదేహాలతో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్న వైఎస్సార్ సీపీ, వామపక్ష నేతల నిర్ణయాన్ని నీరు కార్చేందుకు ప్రభుత్వాస్పత్రి నుంచి మృతదేహాలను అంబులెన్స్‌లో తెలుగుదేశం నాయకులు ఎస్కార్ట్‌గా మృతుల గ్రామానికి తీసుకువెళ్లారు.

రుయాలో మరింత మెరుగైన వైద్యం


రుయాలో వైద్యసేవలపై రోగులను ఆరా తీస్తున్న అదనపు సీఎస్, కలెక్టర్

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు స్పష్టం చేశారు. గురువారం రుయాలో ఆయన కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి పలు విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుయాలో సదుపాయాలను ఏ విధంగా మెరుగుపరచాలి అనే అంశంపై సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ తదితరులతో ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. వైద్యసేవలపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి సెక్యూరిటీ అంశం, మందుల స్టాక్, సీసీ కెమెరాల ఏర్పాటు, సర్జికల్ పరికరాలు, సిబ్బంది ఏర్పాటు తదితరాలను పరిశీలించామన్నారు. రూ.90 కోట్ల వరకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, పీజీ సీట్లు పెంచుతున్న నేపథ్యంలో సదుపాయాల కల్పన కోసం మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఉదయం, మధ్యాహ్నం , సాయంత్రం సైతం ఓపీ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సంబంధిత ఫ్యాకల్టీ, సర్జికల్ సిబ్బంది తప్పకుండా ఆ సమయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తాం


అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ

నాయుడుపేటటౌన్: మండలంలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే వాటిని కూల్చివేస్తామని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు గురువారం హెచ్చరించారు. తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖినదిని వద్ద కొందరు ఆక్రమించుకుని, భవనాలు నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఇరిగేషన్ ఏఈ పంచాయతీ, రెవెన్యూ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తిమ్మాజికండ్రిగ పరిధిలోని స్వర్ణముఖి నది ఒడ్డున జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. పనులు చేయకూడదని, వారిని ఏఈ హెచ్చరించారు.

భవిష్యత్తు డిజిటల్ టెక్నాలజీదే


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, వీసీ, అతిథులు

తిరుపతి సిటీ: భవిష్యత్తు డిజిటల్ టెక్నాలజీదేనని, పారిశ్రామిక రంగంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రధాన పాత్ర పోషిస్తోందని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం పద్మావతి మహిళా వర్సిటీలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు, ఎన్జీవోలకు ఆధునిక సాంకేతిక డిజిటల్ టెక్నాలజీపై మూడురోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ప్రభుత్వం స్టార్ట్ అప్ పరిశ్రమలకు అన్ని విధాలుగా చేయూతనిస్తోందన్నారు. డిజిటల్ ప్లాట్ ఫామ్ వినియోగించుకుని మార్కెటింగ్, పేమెంట్ వంటి వ్యాపార వ్యవహారాలు సులభతరం అవుతాయన్నారు. ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ పేరుతో నిర్వహిస్తున్న వైఫై డిఎక్స్ శిక్షణ ప్రపంచంలోని 18 దేశాలలో అమలు చేశారని, అందులో ఇండియాలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. మహిళలు ఈ డిజిటల్ ప్రపంచాన్ని ఎదుర్కొని, తాము నిర్వహిస్తున్న వ్యాపారాలను లాభసాటిగా మలుచుకునేందుకు అవసరమైన మెలకువలు వ్యాపార రంగంలో డిజిటల్ వ్యవస్థ వినియోగంపై అవగాహన పెంపొందించుకోనేలా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యునైటెడ్ నేషన్స్, థాయిలాండ్, సింగపూర్ ఫిలిప్పీన్స్, కొరియా ట్రైనర్స్ ఎంతో ఉత్తమమైన శిక్షణను ఇవ్వనున్నారని తెలిపారు. దేశంలో ఏకైక ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సెంటర్‌గా 2018 నుంచి 3 వేల మందికి పైగా మహిళలకు ఆత్మనిర్భర్ భారత్ అభివృద్ధి చేయడంలో మహిళ వర్సిటీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విదేశీ ట్రైనర్లు డాక్టర్ కియోంగ్ కో, ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, మాజీ వీసీ దుర్గాభవానీ, రిజిస్ట్రార్ రజినీ, అధ్యాపకులు, విదేశాల నుంచి విచ్చేసిన ట్రైనర్లు, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు చంద్రశేఖర్ రాజు, హరినాథరాజు కథనం మేరకు.. 2019 డిసెంబర్ 8వ తేదీ మధ్యాహ్నం ప్రొద్దుటూరు రేంజ్ ఫారెస్ట్ అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో కాజీపేట సెక్షన్, నాగసానిపల్లి బీట్, లంక మల్ల రిజర్వ్ ఫారెస్ట్, పోతబత్తుని బావి ప్రాంతంలో అటవీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ సుమోలో 60 కిలోల 5 ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న వైఎస్సార్ జిల్లా, ఎర్రగుంట్ల, రాణివనం గ్రామానికి చెందిన సుమో డ్రైవర్ మంగపట్నం వరప్రసాద్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. అతనిపై నేరం రుజువు కావడంతో వరప్రసాద్‌కు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నగేష్ వాదించారు.

అక్రమ మైనింగ్‌పై మెరుపు దాడులు

- వాహనాల స్వాధీనం
- 13 మందిపై కేసు నమోదు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఇవే


దాడులు చేస్తున్న పోలీసులు

సైదాపురం: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ, పోలీసులు మెరుపుదాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ మైనింగ్ పనులకు వినియోగిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న వాహనాలను పది నిమిషాల్లో వదిలి వేశారన్న వార్త సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కాని అధికారులు మాత్రం దాడులు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని 13 మందిపై కేసులు కూడా నమోదు చేశామని చెబుతున్నారు. ఈసంఘటన మండల కేంద్రమైన సైదాపురం -తూర్పుపూండ్ల మధ్యలో ఉన్న శ్రీనివాస పద్మావతి మైన్‌లో గురువారం చోటు చేసుకుంది. అధికారుల కథనం మేరకు.. సైదాపురం -తూర్పుపూండ్ల మధ్యలో ఉన్న శ్రీనివాస పద్మావతి మైన్‌లో గత కొంత కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నారు.

అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందడంతో గురువారం తహసీల్దార్ రమాదేవి, ఎస్‌ఐ క్రాంతికుమార్ సంయుక్తంగా దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెండు టిప్పర్లు, ఒక హిటాచీ, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న అమర్‌నాథ్‌రెడ్డితోపాటు మరో 12 మందిని విచారించగా వారు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారిపై కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసుల నమోదు చేయడంతోపాటు 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న రెండు టిప్పర్లు, జేసీబీని స్టేషన్‌కు తీసుకుని వచ్చామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే ఆ ప్రాంతంలోనే పాడైన ఓ హిటాచీ కూడా ఉందన్నారు. ఈ వాహనంతోపాటు సీజ్ చేసిన మరో హిటాచీని స్టేషన్‌కు తీసుకుని వస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ కేసులో ఎలాంటి వాహనాలను వదిలిపెట్టలేదని ఎస్‌ఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నా సంబంధింత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

26న లీజు బహిరంగ వేలం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏడాది పాటు వివిధ పనులు నిర్వహణ లీజు కోసం ఈనెల 26వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో అమ్మవారికి భక్తుల సమర్పించే చీరలు, రవికల సేకరణ, కొబ్బరి చిప్పలు సేకరణ, వెయ్యి కళ్ల దుత్తలు విక్రయం, సజీవ కోళ్ల సేకరణ, పాదరక్షలు భద్రపరిచే రుసుం వసూలు కోసం ఏడాది పాటు లీజుహక్కు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ వేలంలో లీజుహక్కు పొందిన వారు నవంబర్ ఒకటి నుంచి 2025 అక్టోబర్ 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు ఆలయంలోని కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 30వ తేదీల్లో వివిధ క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎస్.జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 26వ తేదీ ఉదయం 9.30 గంటలకు తిరుపతి బాలాజీకాలనీలోని విశ్వేశ్వరయ్య యోగా సెంటర్‌లో యోగాసన, 27వ తేదీ ఉదయం 9.30 గంటలకు రేణిగుంట జెడ్పీ బాలికల హైస్కూల్లో సాఫ్ట్‌టెన్నిస్, స్క్వాష్, ఉషు క్రీడల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 30వ తేదీ ఉదయం 9.15 గంటలకు చిత్తూరులోని డీఎస్‌ఏ మైదానంలో ఖోఖో, రోప్ స్కిప్పింగ్, మల్లకంబ్, ఫెన్సింగ్ క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఆయా పోటీలకు హాజరయ్యే బాలబాలికలు పదో తరగతి మార్క్స్ లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. గురువారం అర్ధరాత్రి వరకు 64,447 మంది స్వామివారిని దర్శించుకోగా 25,555 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.38 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. సర్వదర్శనం భక్తులకు 8 గంటల సమయం పడుతోంది. ఏడు కంపార్ట్‌మెంట్లలో భక్తులు దర్శనార్థమై వేచియున్నారు.

శ్రీసిటీని సందర్శించిన తనిఖీ బృందం


శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమైన రాష్ట్ర ప్రభుత్వ భద్రతా తనిఖీ బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధామిశ్రా నేతృత్వంలోని పారిశ్రామిక భద్రత ప్రమాణాల ఉన్నత స్థాయి కమిటీ ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు శ్రీసిటీలో చేపట్టిన తనిఖీలు గురువారం ముగిశాయి. పారిశ్రామిక రంగాల్లో భద్రతపై అవగాహనను పెంపొందించడానికి, కార్మికుల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా కమిటీ పర్యటన సాగింది. ఈ పర్యటనలో కమిటీలోని ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు శ్రీసిటీలోని ప్రధాన పరిశ్రమలైన డైకిన్, డానియెలీ, కింబర్లీక్లార్క్, ఆల్‌స్టామ్‌లో తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఆయా పరిశ్రమల్లో ఎలాంటి భద్రతా లోపాలు తమ దృష్టికి రాలేదని మిశ్రా తెలిపారు. శ్రీసిటీలోని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలను పాటించడంలో నిబద్ధతతో ఉన్నాయన్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.